క్లుప్తంగా

ఉపాధి సిబ్బందికి శిక్షణ



ఉపాధి సిబ్బంది శిక్షణ కార్యక్రమం

జె.పంగులూరు: మండల పరిధిలోని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఓ సంతోషం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం యాప్‌ల గురించి, మస్టర్ ఈకేవైసీ చేయించుకుంటేనే ఇక నుంచి ఉపాధి హాజరు మొబైల్‌లో కాప్చర్ అవుతుందన్నారు. లేకుంటే హాజరు పడే అవకాశం లేదని తెలియజేశారు. ఆగస్టు 7 నుంచి ఈ మార్పు వర్తిస్తుందని, పనులు గుర్తించే విషయంలో చాలా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు పని ప్రదేశాన్ని సక్రమంగా చేయవలేనని, లేకుంటే పని చేయుటకు ఇబ్బంది పడే అవకాశాలున్నాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రతి పనిని తప్పనిసరాగా క్యాప్చర్ చేసి యాప్‌లో చేయాలన్నారు. ఈ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె. సుమంత్, రాంబాబు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రత్నకుమారి

యద్దనపూడి: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై రత్నకుమారి అన్నారు. గురువారం పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ మత్తులో నేడు యువత అనేక నేరాలు చేస్తున్నారని, మాదక ద్రవ్యాల వాడకంతో మానసిక, శారీరక అనారోగ్య సమస్యలు తలెత్తి ప్రాణహాని జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే పోక్సో చట్టం గురించి విద్యార్థులకు వివరించడంతో పాటు రహదారి నియమ నిబంధనల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏఎమ్ శ్రీనివాసరావు, పీఈటీ అంకరాజు, ఈగల్ టీమ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీల్లో సత్తా

పర్చూరు(చినగంజాం): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పర్చూరు వైఆర్ హైస్కూల్‌లో మండల స్థాయి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. నాదేశం నా జెండా అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో అడుసుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థిని కె. అక్షర బిందు ప్రథమ స్థానంలో నిలిచింది. డ్రాయింగ్ పోటీల్లో పర్చూరు వైఆర్ హైస్కూల్‌కు చెందిన 8 వ తరగతి విద్యార్థి మామిడి విజయకుమార్ ప్రథమం సాధించాడు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వీరు 11వ తేదీ బాపట్లలో జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంఈఓ 1 శివకోటేశ్వరరావు, ఎంఈఓ 2 పి. వెంకటరామయ్య పాఠశాల హెచ్‌ఎంలు ఎం నిర్మలాకుమారి, ఇ. రాజశేఖర్, మెంటర్ ఇంగ్లిషు ఉపాధ్యాయుడు శీరాం శ్రీనివాసరావు అభినందించారు.

250 మందికి వైద్య పరీక్షలు

పర్చూరు(చినగంజాం): చెరుకూరు ఎస్ఎస్ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ డి. అనూజ గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు లెప్రసీ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం బెంజిమన్ హనోక్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి మోసాలపై నిలదీద్దాం



క్యూ ఆర్ కోడ్ ఉన్న పత్రాలను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

చీరాల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను నిలదీయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బక్క అద్దంకిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం విజయనగర్‌కాలనీ పంచాయతీలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల ముందు ఎన్నో పథకాలు ప్రకటించి ఎన్నికల తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు.

అనంతరం చంద్రబాబు మోసాలను తెలియజేసే క్యూర్ కోడ్ కలిగిన పత్రాలను ఆవిష్కరించారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, కావూరి రమణారెడ్డి, చప్పిడి రామచంద్రరావు, పర్వతం శ్రీనివాసరావు, శీలం వెంకటేశ్వరమ్మ, తేళ్ళ పెద్దరాంబాబు, తేళ్ళ రాంబాబు, డి.మార్క్‌బాబు, డి.రవికుమార్, తేళ్ళ పెదలక్ష్మయ్య, డి.సునీల్, తేళ్ళ చిన లక్ష్మయ్య, డి.సాగర్‌బాబు, నూనె పాపయ్య పాల్గొన్నారు.

‘షాలో’ను ఫాలో చేయండయ్యా!



బుర్లవారిపాలెం రోడ్డులో ఆరు నెలల నుంచి మరమ్మతులకు నోచుకోని షాలో బోరు



చీరాల నగర్ గ్రామంలో పనిచేయని బోరు



ఈపురుపాలెం పద్మనాభునిపేటలో

- నెలలుగా మరమ్మతులకు నోచుకోని షాలో బోర్లు
- మంచి నీటి కోసం ప్రజల పాట్లు
- పట్టించుకోని అధికారులు

చీరాల టౌన్: గ్రామ, మండల స్థాయి అధికారులు మొద్దునిద్ర వీడటం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజల దాహార్తికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంతో తాగునీరు అందించే షాలో బోర్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల్లో గ్రామానికి 15 వరకు షాలో బోర్లను, ఇతర చేతిపంపులను ఏర్పాటు చేశారు. అయితే మంచినీటి కోసం ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఏర్పాటుచేసిన ఈ చేతిపంపుల్లో చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. చీరాల మండలంలో ఉన్న 150 షాలో బోర్లలో 60 షాలో బోర్లు ఆరు నెలల నుంచి మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రధానంగా చీరాల మండలానికి దూరంగా ఉన్న తీర ప్రాంత గ్రామాలైన దేవినూతల, కావూరివారిపాలెం, పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం, గవినివారిపాలెం, పచ్చమొగిలి, విజయలక్ష్మీపురం, కీర్తివారిపాలెం, లింగాపురం, నక్కలవారిపాలెం, తోటవారిపాలెం, వాడరేవు గ్రామ పంచాయతీలు, చీరాల పట్టణానికి చేరువగా ఉన్న రామకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్, చీరాల నగర్, కొత్తపాలెం తదితర గ్రామాల్లోని చేతి పంపులనుంచి మంచి నీరు రావడం కరువైంది. ప్రజల దాహార్తికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో సమస్య మరింత జటిలంగా మారనుంది. గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు లేకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులు చేయటానికి నిధులు వెచ్చించాల్సి ఉన్నా.. పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చీరాల మండలానికి సాధారణ నిధులు రూ. 47 లక్షల వరకు ఉన్నాయి. వీటి ద్వారా అభివృద్ధి పనులు, ప్రజలకు మౌలిక వసతులు కల్పన, మరమ్మతులు చేసే అవకాశం ఉన్నా పట్టించుకోవడంలేదు.

త్వరగా మరమ్మతులు చేయిస్తాం

మరమ్మతుల్లో ఉన్న షాలో బోర్లకు రిపేరు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రామాల వారీగా త్వరగా సమస్య పరిష్కరించి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– శివన్నారాయణ, ఎంపీడీఓ: చీరాల

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కారంచేడు లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ, వైద్య సిబ్బంది



పర్చూరు: మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ లవన్న



ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దాసరి చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలకు దూరంగా ఉండవచ్చని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. ఉప్పుటూరు ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాలలో ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, విషజ్వరాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలాలు మారుతున్నప్పుడు వాతావరణంలో వచ్చే మార్పుల వలన అనేక రకాల అంటు వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రస్తుతం పడుతున్న వర్షాల కారణంగా నీరు ఎక్కడ పడితే ఎక్కడ నిలిచి ఉండటం వలన దోమలు సంఖ్య పెరుగుతోందని అందువల్ల చికెన్ గున్యా, మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వైరల్ విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో ఉన్న కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, మరుగు కాలువలలో నీరు నిలువకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందిరపై ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన మానివేయడం ద్వారా కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతన పాటించడం ద్వారా తామర వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్‌లను అరికట్టవచ్చన్నారు. సీహెచ్‌ఓ శృతి, ఆశ వర్కర్ రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

పర్చూరు(చినగంజాం): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ ఎస్. లవన్న కోరారు. గురువారం పర్చూరు, నాగులపాలెం, నూతలపాడు, చింతగుంటపాలెం, కొల్లావారిపాలెం గ్రామ పంచాయతీలను పరిశీలించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఉండకుండా చూడాలని, డ్రైనేజీలో మురుగు నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి జరుగుతుందని తద్వారా డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తాయన్నారు. ముందుగా పర్చూరు ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని మురుగు నీటి కుంటల్లో బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ స్ప్రే చేయించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రైనేజీలో స్ప్రే చేయించాలని ఆదేశించారు. పర్చూరు ఓవర్ హెడ్ ట్యాంకు ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించారు. నెహ్రూ కాలనీలోని ఎంపీపీ పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికలో రెండో ఉపాధ్యాయుడు సంతకం చేయకపోవడంపై విచారించారు. అనంతరం నాగులపాలెం డంప్ యార్డును పరిశీలించగా గ్రామంలో సేకరించిన చెత్తను పడవేసేందుకు ప్రభుత్వ స్థలం లేదని, చెరువు కట్ట పక్కన డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ఎన్టీఆర్ కాలనీ వాసులు తమకు ఇబ్బందిగా ఉందని ఫిర్యాదులు చేస్తున్నట్లు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, గ్రామ కార్యదర్శులు ఎ. మస్తాన్ రావు, పి. రాకేష్, ఏ. రామ బ్రహ్మం, పంచాయతీ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కారంచేడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని బాపట్ల జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి సీహెచ్ శ్యాంసన్ అన్నారు. గురువారం కారంచేడులో పారిశుద్ధ్య కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీ సమీపంలోని మురుగునీటి కుంటలను, లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్న ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఎంపీడీఓ కె. నేతాజీ, హెల్త్ సూపర్‌వైజర్ డి. శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



కారంచేడులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పృథ్వీరాజ్



కారంచేడులో తల్లులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేస్తున్న హిమబిందు



చినగంజాం: తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న డాక్టర్ సాయిశ్రీ చరణ్

చినగంజాం: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని బిడ్డకు తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తితో పాటు అభివృద్ధి జరుగుతుందని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పి. సాయి శ్రీచరణ్ అన్నారు. గురువారం కొత్తపాలెం పంచాయతీలో తల్లిపాల వారోత్సవాలు చివరి రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు తొలి టీకా వంటిదని, తల్లిపాలు బిడ్డ పుట్టిన వెంటనే అందజేసి సమాజానికి ఆరోగ్యవంతమైన బిడ్డను అందించాలని సూచించారు. తల్లి తీసుకోవాల్సిన ఆహారం గురించి ఆయన వివరించారు. అందరికీ పోషక విలువలతో కూడిన కిట్‌లను అందజేశారు. సూపర్ వైజర్‌లు ఎస్. సుమలత, వాణిశ్రీ, ఉషా కుమారి, ఆయా కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కారంచేడు: బిడ్డ పుట్టిన ఒక గంట సమయంలోపు ముర్రుపాలు పట్టించాలని కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్ హిమబిందు అన్నారు. గురువారం కారంచేడులో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. తల్లి పాలల్లో ఉండే కొలెస్ట్రమ్ వలన బిడ్డలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని స్వర్ణ, కారంచేడు పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ జి. సురేష్‌బాబు, డాక్టర్ షాలిని అన్నారు.

వైద్య సేవలు ఉపయోగించుకోండి

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు క్రమం తప్పకుండా మీ సమీప ఆరోగ్య కేంద్రాల్లో తప్పకుండా అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని మండలంలోని స్వర్ణ, కారంచేడు పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ జిప సురేష్‌బాబు, డాక్టర్ షాలిని అన్నారు. గురువారం వారు మండలంలోని స్వర్ణ, కారంచేడు పీహెచ్‌సీలలో ఏర్పాటు చేసిన గర్భిణుల వైద్య పరీక్షల్లో పాల్గొని వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సలహాలను అందించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతు గర్భిణులు ప్రతి ఒక్కరూ మూడో నెలలోనే మీ ప్రాంత ఆశాలు, ఏఎన్ఎంల వద్ద మీ పేరు, ఊరు, అడ్రెస్, కాన్పు, వైద్య పరీక్షల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. అప్పటి నుంచి వైద్య సిబ్బంది మీకు అందుబాటులో ఉంటూ మీకు అవసరమైన అన్ని ఇంజక్షన్లు చేస్తూ ఇంకా అవసరమైన రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేయిస్తారన్నారు. ముఖ్యంగా రక్తహీనతతో ఇబ్బందులు పడే వారిని గుర్తించి వారిని హైరిస్క్ గర్భిణుల లిస్ట్‌లో నమోదు చేసి అవసరమైన పరీక్షలు చేస్తారన్నారు. హైరిస్క్ గర్భిణుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. మీ బ్లడ్ గ్రూప్‌కు తగిన రక్త నిల్వలు కూడా అందుబాటులో ఉంచుతారన్నారు. సుఖ ప్రసవం వరకు మీకు అవసరమైన అన్ని సేవలందిస్తారన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని సుమారు 26 మంది గర్భిణులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ డి. శ్రీనివాసరావు, హెచ్‌ఈ మాధవి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎల్‌టీలు సుబ్బారావు, బయ్యా శంకర్, స్టాఫ్‌నర్స్‌లు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలు నెరవేర్చాలి



పర్చూరు అంబేడ్కర్ నగర్‌లో మాట్లాడుతున్న కఠారి అప్పారావు

పర్చూరు(చినగంజాం): రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నీటి మూటలయ్యాయని పర్చూరు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కఠారి అప్పారావు అన్నారు. గురువారం మండలంలోని అంబేడ్కర్ నగర్‌లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల కన్వీనర్ కఠారి అప్పారావు ఇంటింటికీ తిరిగారు. బాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వాటిని అమలు చేయలేని కూటమి ప్రభుత్వం తీరును గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలోని నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడి ప్రజలకు బాబు మోసాలను ఇంటింటికీ తిరిగి ప్రతి కుటుంబ సభ్యునికి తెలియజేయాల్సిందిగా సూచించారు. ప్రజలందరూ బాబు మోసాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో వివిధ హోదాల్లో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో..

మండలంలోని అనంతవరం గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబు ఇచ్చిన హామీలను , సూపర్ సిక్స్ అమలు చేయని తీరును గురించి గ్రామంలో ప్రజలకు ఇంటింటికి తిరిగి వివరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావూరి వేణుబాబు, ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకమంలో మువ్వల రాంబాబు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశంపై అవగాహన పెంచుకోండి



కారంచేడులో పోటీలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంఈఓలు

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు దేశ ఔన్నత్యం, దేశ పరిస్థితులపట్ల పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు జి. నాగరాజు అన్నారు. గురువారం కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మనదేశం–మనజెండాపై మండల స్థాయి పోటీలను పరిశీలించి మాట్లాడారు. కారంచేడు, కుంకలమర్రు, కొడవలివారిపాలెం, స్వర్ణ, ఆదిపూడి, యర్రంవారిపాలెం ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలను జిల్లా స్థాయిలో ఈ నెల 11వ తేదీన జరగనున్న పోటీలకు పంపిస్తామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు, దేశ రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎంఈఓ మొలబంటి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం ఎస్. సామ్రాజ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రేకుల షెడ్డులో అంగన్‌వాడీ కేంద్రం -4 (నాడు)



ఆడిటోరియంలో శ్లాబు పెచ్చులు ఊడుతున్న దృశ్యం (నాడు)

చిన్నారులు క్షేమం

- పాడుబడిన కేంద్రాల నుంచి అద్దె భవనాలకు మారిన అంగన్‌వాడీ కేంద్రాలు

సాక్షి ఎఫెక్ట్..



అద్దె భవనంలోకి మార్చిన అంగన్‌వాడీ- 6 కేంద్రం (నేడు)

జె.పంగులూరు: పంగులూరు అంగన్ వాడీ కేంద్రాలపై బుధవారం సాక్షిలో ప్రచురితమైన ‘ప్రమాదంలో బాల్యం’ అనే కథనంపై అధికారులు స్పందించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు–4,6 లను పరిశీలించి అన్ని వసతులతో కూడిన అద్దె భవనాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిర్మాణంలో ఉండి ఆగిపోయిన అంగన్‌వాడీ కేంద్రాల గురించి అధికారులతో మాట్లాడి నిర్మాణం జరిగే విధంగా చూస్తామని తెలిపారు. గురువారం ఆడిటోరియం, రేకుల షెడ్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని వసతులతో కూడిన అద్దె భవనాల్లోకి మార్చారు. దీంతో చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

అందరికీ అందుబాటులో కార్పొరేట్ వైద్యం

- అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ చీరాల ఎండీ రవికిరణ్



మాట్లాడుతున్న ఎండీ డాక్టర్ రవికిరణ్

చీరాల: అపోలో స్పెక్ట్రా హాస్పిటల్.. చీరాల ప్రాంతంలో అందుబాటులో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవికిరణ్ పేర్కొన్నారు. అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ చీరాలలో ప్రారంభించి ఏడాది అయిన సందర్భంగా గురువారం హాస్పిటల్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. హాస్పిటల్‌లో పూర్తిస్థాయి నాణ్యత కలిగిన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర, ట్రామా వైద్య సేవల కోసం గుంటూరు, విజయవాడ వెళ్లే అవసరం లేకుండా చీరాల్లోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌లో వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్‌లో పది విభాగాలకు సంబంధించిన అనుభవం కలిగిన వైద్యనిపుణులున్నారని, నాణ్యత పరమైన వైద్యం, ఇన్ఫెక్షన్ నియంత్రణలో ఎక్కడా రాజీపడని వైద్య సదుపాయాలున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం, ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్ కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయన్నారు. బీమా పాలసీలతో రోగులకు నగదు రహిత వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యకలాపాల కింద రామాపురం, వీరన్నపాలెం రెండు గ్రామాలను దత్తత తీసుకున్నామన్నారు. చీరాల పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడానికి అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ కట్టుబడి ఉందన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి



కనగాలవారిపాలెంలో రైతులకు శిక్షణ ఇస్తున్న ఆత్మ, మరియు వ్యవసాయశాఖ అధికారులు

మేదరమెట్ల: పొగాకు పంటను తగ్గించి శనగ, మినుము మొక్కజొన్న పంటలవైపు రైతులు మొగ్గు చూపాలని అద్దంకి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎఫ్రాయిమ్ అన్నారు. కొరిశపాడు మండలంలోని కనగాలవారిపాలెంలో ఆత్మ.. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకంలో డబ్బులు పడని రైతులు పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో వీఏఏలను సంప్రదించాలన్నారు. బాపట్ల డాట్ శాస్త్ర వేత్త బాలమురళీధర్ నాయక్ మాట్లాడుతూ పలు పంటల్లో వచ్చే పురుగులు.. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఏవో రామ్మోహన్‌రెడ్డి, బీటీఎం శేషారావు, ఏటీఎం రామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు భవితకు సోపానాలు



గ్రంథపాలకురాలు ధనమ్మ సత్కరిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పోటీ పరీక్షల్లో విజయం సాధించే విద్యార్థులు, యువత భవితకు గ్రంథాలయాలు సోపానాల్లా ఉపయోగపడతాయని గ్రంథపాలకులు ఎ.ప్రసాద్, డి.ధనమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో పోటీ పరీక్షల సమాచారాన్ని ఉపయోగించుకుని పోలీస్ కానిస్టేబుళ్ళుగా ఎంపికైన ఏడుగురు యువకులకు సన్మానం నిర్వహించారు. అలానే వీరిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు గ్రంథాలయ సేవలను ఉపయోగించుకోవాలని వక్తలు సూచించారు. అలానే చీరాల నుంచి ఉప్పుగుందూరు లైబ్రరీకి బదిలీపై వెళుతున్న డి.ధనమ్మను సత్కరించారు. గ్రంథపాలకురాలిగా ఆమె చేసిన సేవలను గుర్తు చేశారు. బత్తుల బ్రహ్మారెడ్డి, సర్విశెట్టి సుబ్బరామయ్య, ఎ.నాగవీరభద్రాచారి, ఎస్.యల్లమందారెడ్డి, వడలి రాధాకృష్ణ, చుండూరు కృష్ణమూర్తి, పవని భానుచంద్ర తదితరులు పాల్గొన్నారు.